ఓం నమో భగవతే శ్రీ రమణాయ



# రమణ భాస్కర



వ్యవస్థాపక సంపాదకులు : బి.వి.ఎల్.ఎన్.రాజు

సంపుటి : 16 సంచిక : 07 మార్చి 2011

రమణ భాస్కర
ఆధ్యాత్మిక మాస పత్రిక
పేజీలు : 20
గౌరవ సంపాదకులు
శ్రీమతి P.H.V. సత్యవతి (హైమ)

చందా
సంవత్సర చందా:రు॥150/-
విడి ప్రతి : రు॥ 15/-

చిరునామా
రమణ భాస్కర
శ్రీ రమణ క్షేత్రం,
జిన్నూరు - 534 265
ప॥గో॥ జిల్లా, ఆం॥ప్ర॥

పబ్లిషర్
సద్గురు శ్రీ నాన్నగారు
శ్రీ రమణ క్షేత్రం
జిన్నూరు ~ 534 265
☎ 08814 - 224747
9247104551

ఈ సంచికలో....

ఏలూరు .......... 06-01-2011
జిన్నూరు ......... 23-01-2011
చెరుకుమిల్లి .... 14-01-2011

ప్రింటర్
శ్రీ భవాని ఆఫ్‌సెట్ ప్రింటర్స్
(దుడే శ్రీను) ఎస్.వి.ఆర్. కాంప్లెక్స్,
పాలకొల్లు, 9848716747

## (సద్గురు శ్రీ నాన్నగారి అనుగ్రహభాషణములు, 06-01-2011, ఏలూరు)

ప్రియమైన ఆత్మబంధువుల్లారా,

విష్ణువు యొక్క నామాలలో అచ్యుత, అనంత, గోవింద ఈ మూడు నామాలు ముఖ్యమైనవి. ఈ నామాల్ని మనం స్మరించుకోవటం వలన మన బుద్ధి శుద్ధమవుతుంది. తిరుమల కొండమీద ఒక రాయే కాదు, వృక్షమేకాదు, ఆకేకాదు తిరుమల కొండ అంతా మహావిష్ణువు యొక్క స్వరూపమే. వేంకటేశ్వరస్వామిని అందరూ మహావిష్ణువు అని అంటారు. మహావిష్ణువు మాత్రమేకాదు సర్వదేవతాస్వరూపుడు. ద్వాపర యుగంలో ఎవడైతే గోవిందుడో ఆ గోవిందుడే కలియుగంలో వేంకటేశ్వరస్వామి రూపంలో కొండమీద వెలిసాడు. అందుచేత భక్తులు అందరూ కొండమీదకు వెళ్ళినప్పుడు వేంకటేశ్వరా, వేంకటేశ్వరా అని స్మరించరు గోవిందా, గోవిందా అని పిలుస్తారు. గోవిందుడే వేంకటేశ్వర స్వామి రూపంలో ఉన్నాడని ప్రసిద్ధి. కలియుగానికి వేంకటేశ్వరస్వామి అధిష్ఠానదైవం. కలియుగదైవమైనటువంటి వేంకటేశ్వరస్వామిని స్మరించుకోవటం వలన ఆయన రూపాన్ని ధ్యానించుకోవటం వలన మన బుద్ధిలో ఉన్న దోషాలు హరిస్తాయి, మన బుద్ధి పవిత్రం అవుతుంది.

భగవద్గీత అంటే భగవంతుడు చెప్పినమాట, మనకి భగవంతుడి మీద ప్రేమ ఉంటే భగవంతుడిమీద భక్తి ఉంటే, భగవంతుడి మీద ఇష్టం ఉంటే, ఆయన చెప్పిన మాట మీద భక్తి, ప్రేమ, ఇష్టం కలుగుతుంది. భగవంతుడు మీద మనకి ఇష్టం లేనప్పుడు ఆయన చెప్పిన మాట మీద గౌరవం కలగదు. సాక్షాత్తు బ్రహ్మమే నామరూపాలు ధరించి భగవద్గీత బోధించింది కాబట్టి దీనిని భగవాన్ ఉవాచ అన్నారు.

**కామ ఏష క్రోధఏష రజోగుణ సముద్భవః**

**మహాశనో మహాపాప్మా విద్ధ్యేనమిహ వైరిణమ్ (3-37)**

కామక్రోధాలు అన్నా, రాగద్వేషాలు అన్నా ఒక్కటే. జీవుడిని పీడించేవి ఈ కామక్రోధాలే. గజేంద్రుడిని మొసలి పట్టుకున్నట్టు ఈ కామక్రోధాలు జీవుడిని పట్టుకుని జీవుడు మోక్షం పొందకుండా, పరమాత్మ జ్ఞానం పొందకుండా ఆ జీవుడిని దేహానికి బంధిస్తున్నాయి. ఏది అయితే బ్రహ్మమో అదే మనం అయినప్పటికి దాని తాలుక అనుభవంకాని, దాని తాలుక సుఖంకాని, దాని తాలుక శాంతికాని మనకి అనుభవంలోనికి రాకుండా చేసేవి ఈ కామక్రోధాలే. రజోగుణం ఎక్కడ అయితే ఎక్కువ ఉందో అక్కడ కామక్రోధాలు ఉంటాయి. సత్వగుణం ఉన్నవాడు నిదానంగా ఆలోచిస్తాడు. వాడికి కామక్రోధాలలోంచి విడుదల పొందుదాము అనే వివేకం కలుగుతుంది. పాములు పుట్టలో ఎలాగ ఉంటాయో అలాగ కామక్రోధాలు మనస్సులో ఉంటాయి. మన ఇంద్రియాలు వెళ్లి మనస్సును ఆకర్షిస్తాయి. ఇంద్రియాలు మూలంగా మన మనస్సు తొందరగా బహిర్ముఖమవుతుంది. మనస్సు బహిర్ముఖం అవ్వటం తేలిక. మన మనస్సుని అంతర్ముఖం చేయటం కష్టం. దైవానుగ్రహం లేకుండా మన మనస్సు అంతర్ముఖం అవ్వదు, నువ్వు ఏది అయినా పని మొదలుపెట్టినప్పడు ఆ పని పూర్తి అవ్వాలి అని చేసుకుంటావు అది మంచిదే. నీకు ఆ పని పూర్తి అవ్వటం ఎంత ముఖ్యమో, నువ్వు పని చేసేటప్పడు ఆ పని ఎలా చేస్తున్నాము, సక్రమంగా చేస్తున్నామా అనేది కూడా అంతే ముఖ్యం. మీరు బజారులో ఏదయినా వస్తువు కొనుక్కున్నప్పడు ఆ వస్తువు మన్నిక ఎలా ఉంటుందో చూచుకుంటారు కదా అలాగే మీరు పని చేసేవిధానంలో విలువలు ఉన్నాయా లేక విలువలు విడిచిపెట్టేసి ఆ పని పొందటం కోసమే చేస్తున్నారా అది చూసుకోవాలి. అక్కడ పని సాధించటం ముఖ్యం కాదు దానికి తగిన విలువలు సరిగ్గా ఉన్నాయో లేదో ఆలోచించుకో, దానిని అవలంభించే విధానం కూడా సక్రమంగా ఉంటే నీ బుద్ధికి ఏకాగ్రత వస్తుంది, నీ బుద్ధి బాగుపడుతుంది, నీ మనస్సు బాగుపడుతుంది, నీ మనస్సు బాగుపడితే నువ్వు శ్రేయస్సు పొందుతావు. నీ మనస్సు పాడయిపోతే చివరికి నువ్వు పతనం అయిపోతావు. నువ్వు బాగుపడినా నీ మనస్సే కారణం, నువ్వు పాడయిపోయినా నీ మనస్సే కారణం. మనం మన మనస్సును బాగుచేసుకోవటానికి ఏమీ ప్రయత్నం చేయటంలేదు. దేహానికి మరణం వచ్చేస్తోంది. మనం టైము పాడు చేసుకుంటున్నాము. డబ్బుపోతే తిరిగి సంపాదించుకోవచ్చు కాని కాలాన్ని దుర్వినియోగం చేసుకుంటే ఆ కాలం తిరిగిరాదు.

కామం అంటే కోరిక. కామం అనేది మహాశని. కోరిక నువ్వు అనుభవించే కొలది పెరిగిపోతుంది కాని అది ఇంక తగ్గదు. ఆ గొయ్యిని ఎవడూ పూడ్చలేడు. వెయ్యికోట్ల డబ్బు సంపాదించి మీ పిల్లలకి ఇవ్వండి. వాళ్ళు సంతృప్తి పడరు. మీరు వెయ్యికోట్లు డబ్బు సంపాదించి ఇస్తే వాడికి మంచిగుణం లేకపోతే మీరు ఇచ్చిన వెయ్యికోట్లు తినేస్తాడు కాని మీరు చనిపోతే మీ శవం కూడా స్మశానం వరకు కూడా రాడు. అది మానవుడి యొక్క స్వభావం. ఇస్తే తినేస్తాడు కాని వాడికి కృతజ్ఞత ఉంటుందని మీరు అనుకోవద్దు. వచ్చిన కోరికల్లా నెరవేర్చుకుంటూ కోరికలని జయించినవాడు ఈ సృష్టిలో ఎవడూ లేడు. నిప్పులో కిరసనాయిలు వేస్తే మంట ఎలా పెరిగిపోతుందో అలాగ నువ్వు కోరికలు నెరవేర్చుకొనే కొలదీ ఆ కోరికలు పెరిగిపోతాయి. ఒక కోరిక నెరవేరితే, నెరవేరిన కోరిక ఇంకో పది కోరికలని తీసుకువస్తుంది. అందుచేత కోరికలకి అంతులేదు. పరమాత్మ కోరికకి మహాశని అని పేరు పెట్టాడు. నువ్వు కామక్రోధాలని సంతృప్తిపరచుకుంటూ వెడితే దానికి ముగింపు లేదు. చివరికి నువ్వు శవాలని మోస్తూ ఉండాలి. అలాగని నీ పొట్టకోసం, నీ బట్టకోసం ఇతరుల మీద ఆధారపడకు. నీ శరీరయాత్రకి అవసరమైనంతవరకు నువ్వే సంపాదించుకో అంతేగాని వేలాదికోట్లు సంపాదించేసి, వేలాది కోట్లు పోగుపెట్టేద్దాము అని ఆ గొడవలలోకి నువ్వు వెళ్ళకు. ఆ గొడవలోకి వెడితే పైకి అందరూ నిన్ను పొగుడుతూ ఉంటారు. నువ్వు మూలంలో నాశనం అయిపోతావు. అదే మహాశని.

నువ్వు కామక్రోధాల యొక్క వేగం తగ్గించుకోవటానికి సాధన చేసుకో. నీకు సినిమాకి వెళ్ళాలనే కోరిక వచ్చింది అనుకో, నీ వివేకంతోటి, నీ బుద్ధి సూక్ష్మతతోటి సినిమాకి వెళ్ళాలనే కోరిక తొలగించుకున్నావు అనుకో, ఆ మరుసటి రోజున నీకు సినిమాకి వెళ్ళి వచ్చిన దానికంటే వెళ్ళకపోవటం వలన ఎక్కువ శాంతి కలుగుతుంది. నీకు ఏది అయినా కోరిక వస్తే ఆ కోరికని సంతృప్తి పరచుకోవటం కంటే ఆ కోరికని నిగ్రహించుకోవటం వల్ల నీకు ఎక్కువ సంతోషం వస్తుంది, ఎక్కువ శాంతి, ఆనందం వస్తుంది. నువ్వు కోరికల తోటి పోరాడి కోరికల్ని జయించలేవు. మనకి భగవంతుడిని తెలుసుకోవాలనే జిజ్ఞాస పెరిగితే, అజ్ఞానంలోనుండి, అవిద్యలోనుండి, బంధంలోనుండి విడుదల పొందాలి అనే తపన మనలో పెరిగితే మనకు తెలియకుండా చిల్లరకోరికలు అన్నీ తగ్గిపోతాయి. భగవంతుడిని తెలుసుకోవాలనే పెద్ద కోరిక మనకు వచ్చే చిన్న కోరికలను అన్నిటిని తగ్గించేస్తుంది. మీరు సినిమాకి వెడదామని అనుకుంటున్నారు. డాక్టరుగారు మీ గుండె తేడాగా ఉంది సినిమాకి వెడితే చనిపోతారు ముందు హాస్పటల్‌కి వెళ్ళండి అంటే అప్పుడు ఆ సినిమా దృష్టి వెంటనే

మరచిపోతారు. మీ గుండె జబ్బు తగ్గించుకోవటానికి హాస్పటల్‌కి వెళ్ళిపోతారు. అంటే సినిమాకి వెళ్ళాలనే కోరికని హాస్పటల్‌కి వెళ్ళాలనే కోరిక తరిమివేసింది కదా! అలాగే మీరు భగవంతుడిని పొందాలి, మోక్షం పొందాలి అనే కోరిక పెట్టుకుంటే చిల్లరకోరికలు వాటంతటవే పోతాయి. వాటితో మీరు పేచీ పెట్టుకోనక్కరలేదు.

మనకి ఆత్మవిద్య ఎప్పుడు కలుగుతుంది అంటే మనకి బాహ్యవిషయాలమీద ఎంత ఇష్టం ఉందో అంత ఇష్టం అంతర్యామి అయినటువంటి నారాయణుడిమీద కలిగితే, అంత ప్రేమ మనకు కలిగితే మన మనస్సుకి లోచూపు కలుగుతుంది. భగవంతుడి పట్ల మనకి చలించని విశ్వాసం ఉంటే గాలిలేనిచోట దీపం ఎలా ఉంటుందో అంత నిదానంగా మనకి విశ్వాసం ఉంటే దానికి ప్రతిఫలంగా ఆత్మజ్ఞానాన్ని అంటే నిజమైన ఆత్మవిద్యను మనకి ప్రసాదిస్తాడు. అప్పుడు మనకి ఫ్రీడం తెలుస్తుంది. అప్పటి వరకు సుఖం ఏమిటో, శాంతి ఏమిటో మనకి తెలియదు. అది అద్వితీయం. భగవంతుడు ఏమని చెబుతున్నాడు అంటే మీ దేహము చనిపోయే టైముకి అయినా నన్ను పొందటానికి ప్రయత్నం చేయండి అని పరమాత్మ చెబుతున్నాడు.

నిన్ను నువ్వు కాదనుకోకుండా, నన్ను పొందగలవా అంటాడు ఏసు. నువ్వు కాని దేహంతోటి, కాని మనస్సుతోటి తాదాత్మ్యం పొంది అది నేను అనుకుంటున్నావు కదా! ఈ ఆస్తి నాది, ఈ డబ్బు నాది, ఈ గౌరవం నాది, ఈ పలుకుబడి నాది అనుకుంటున్నావు. ఈ దేహము నేను అనుకోవటం ఎంత నిజమో అవి కూడా అంతే నిజం. పైగా ఇవన్నీ చుట్టబెట్టుకొని నీలో ఏదో ప్రత్యేకత ఉంది అనుకుంటున్నావు. ఇవన్నీ పేకముక్కల కోటలు. విచారణ చెయ్యనంతసేపూ నిజంకింద కనిపిస్తాయి. విచారణ చేస్తే నువ్వు ఏదైతే కాదో దానితోటి సంబంధాలు అన్నీ తెగిపోతాయి. పేకముక్కలకోటలు పడగొట్టడానికి గెడ్డపారలు అక్కరలేదు. గట్టిగా గాలివేస్తే పడిపోతాయి. మనకి ఇంతమంది చుట్టాలు ఉన్నారు, బ్యాంకులో ఇన్ని డబ్బులు ఉన్నాయి, ఇన్ని పొలాలు ఉన్నాయి అని నేను వీటిచుట్టూ తిరుగుతూ ఉంటుంది. ఇవన్నీ నేనుకి కాపలా అన్నమాట. నువ్వు ఈ నేనుని విడిచిపెట్టకుండా నన్ను పొందగలవా అంటే జీవలక్షణాలు పోకుండా నువ్వు ఆత్మని పొందలేవు. నీకు రెండూ కావాలంటే సాధ్యం కాదు. నీకు స్వరూపజ్ఞానం కావాలంటే అజ్ఞానం విడిచిపెట్టాలి, అవిద్యని విడిచిపెట్టాలి అన్నాడు ఏసు.

ఉన్న వస్తువు ఒక్కటే అదే బ్రహ్మము. బ్రహ్మమే నీకు దేవుడుగా కనిపిస్తున్నాడు వాడే

నీకు జీవుడుగా కనిపిస్తున్నాడు, వాడే నీకు ప్రపంచంగా కనిపిస్తున్నాడు. కనిపించేదంతా నిజంకాదు. జగత్తు, జీవుడు, ఈశ్వరుడు ఇవన్నీ అజ్ఞానం యొక్క కల్పితములు అని రమణ మహర్షిగారు చెబుతారు. భగవాన్‌తో ఒకరు ఏమన్నారు అంటే ఈ ప్రపంచం ఇంత స్పష్టంగా కనిపిస్తోంది, ఈ జీవకోటి అంతా స్పష్టంగా కనిపిస్తోంది, ఇంత స్పష్టంగా కనిపించే దానిని లేదు అంటే ఎవరు అంగీకరిస్తారు అన్నారు. అప్పుడు భగవాన్ ఏమన్నారు అంటే ఏదైతే నిజమో అది నీకు అబద్ధంగా కనిపిస్తోంది, ఏదైతే అబద్దమో అది నిజంగా కనిపిస్తోంది దీనికి కారణం మాయ అన్నారు. ఆ మాయ ఎక్కడ ఉంది అంటే మీ మనస్సులో ఉంది, మీ ఇంద్రియాలలో ఉంది, మీ బుద్ధిలో ఉంది, ముందు మీలో ఉన్న మాయని కక్కిస్తే, ఆ ముడి తెగిపోతే అప్పుడు నీకు ఉన్న వస్తువు ఉన్నట్టుగా కనిపిస్తుంది, లేనిది లేనట్టుగా నీకు తెలుస్తుంది. అప్పటివరకు ఉన్న నారాయణ స్వరూపం లేదు అనుకుంటావు లేని ప్రపంచాన్ని, లేని సంసారాన్ని ఉంది అనుకుంటావు అన్నారు. ఈ ప్రపంచం నీకు ఎంత నిజంగా కనిపిస్తోందో అంత అబద్ధం అని మీరు చెప్పింది మేము నమ్మలేకపోతున్నాము అన్నాడు. మాయ నమ్మనివ్వదు అన్నారు భగవాన్. గీతలో పరమాత్మ ఏమని చెప్పాడు అంటే నాయందు పరిపూర్ణమైన విశ్వాసం ఉన్నవాడికి, సజీవమైన నమ్మకం ఉన్నవాడికి మాయ దారి ఇస్తుంది కాని, నా మీద నమ్మకం లేనివాడికి వాడు ఎంత సాధన చేసినా, నా దయ లేకుండా వాడి తెలివితేటలు వల్ల మాత్రమే నా మాయని అతిక్రమించలేడు అని పరమాత్మ చెప్పాడు.

మహాశనో, మహాపాప్మా, మీరు అందరూ బుద్ధిమంతులే కాని మీరు పాపాలు చెయ్యటం మానరు. కారణం ఏమిటి అంటే ఈ కామం, క్రోధం మీచేత పాపాలు చేయిస్తాయి. మీకు కోపం వచ్చినప్పుడు, కోరిక వచ్చినప్పుడు బుద్ధిగా ఉండలేరు, శుచిగా ఉండలేరు మీరు పాపాలు చేసి తీరతారు. ఇంత డీటైల్డ్‌గా చెప్పినా మనకి బుద్ధిరావటంలేదు, ఎందుకు బుద్ధి రావటంలేదు అంటే మనకి పుణ్యబలం లేదు. మనకి ఒక మంచి తలంపులేదు, మంచి ఆలోచన లేదు, మంచి చేతలేదు ఇంక మాయ మనకు ఎందుకు దారి ఇస్తుంది, మాయ దారి ఇవ్వదు. ఓ అరుణాచలేశ్వరుడా నా శరీరం స్మశానంలో కాలి బూడిద అవ్వకముందే నీ జ్ఞానాగ్నిని పంపించి నా అజ్ఞానాన్ని, నా కామక్రోధాలని దహించు అరుణాచలేశ్వరుడా. పుల్లల వల్ల పిడకల వల్ల శరీరం కాలుతుంది కాని మనస్సులో ఉన్న గుణాలు కాలవు, అజ్ఞానం కాలదు, జనన మరణ ప్రవాహంలో కొట్టుకుపోయే నన్ను రక్షించడానికి ముందు నాలో ఉన్న అజ్ఞానాన్ని దహింపచెయ్యి అరుణాచలేశ్వరుడా అన్నారు భగవాన్. మీరు అందరూ దుఃఖ స్పర్శలేని స్థితిని పొందాలి. మనకి ప్రారబ్ధం అనుకూలంగా ఉన్నా ప్రతికూలంగా ఉన్నా

మన శాంతిని మనం పోగొట్టుకోకూడదు. మనకి ఒకవేళ కష్టాలు వచ్చినా భగవంతుడు పట్ల సజీవమైన విశ్వాసం జారిపోకుండా చూసుకోవాలి. మనం ఎప్పుడూ విశ్వాసహీనులు అవ్వకూడదు.

మా అత్తగారు శత్రువు, మా మేనత్త శత్రువు, వాళ్ళు శత్రువులు, వీళ్ళు శత్రువులు అని నువ్వు అనుకుంటున్నావు ఇక్కడ భగవంతుడు ఏమంటున్నాడు అంటే నీకు శత్రువు అంటూ ఉంటే ఒకడే శత్రువు నీలో ఉన్న కామమే నీకు శత్రువు. జీవితం పొడుగునా నిన్ను పీడించేది ఆ కామమే. నీకు ఏదైనా పోరాటపటిమ ఉంటే నువ్వు పోరాడవలసింది ఒక్క కామంతోటే. ఒకోసారి మనలో కామం అణిగి వుంటుంది. అప్పుడు మనకి కామాన్ని జయించేశాం అనిపిస్తుంది. మనం భగవంతుడిని పూజించి, జపించి, మంచి వాళ్ళతోటి స్నేహాలు చేసి కోరికను అణుచుకుంటున్నాము కాని కోరిక చచ్చిపోలేదు. మన మీద ఎప్పుడో మళ్ళీ తిరగబడుతుంది. అందుచేత కోరికను మీరు జయించాము అని అనుకోకండి. మీకు ఇప్పుడు దుఃఖం లేదు అని దుఃఖం లేని స్థితికి వచ్చేశాం అనుకోకండి. మీ దుఃఖం అణిగివుంది. అది అణిగివున్నప్పుడు మీకు దుఃఖం లేదు అని అనిపిస్తూ ఉంటుంది. ఆ దుఃఖం బుద్ధిలో దాక్కోవచ్చు, మనస్సులో దాక్కోవచ్చు, ఇంద్రియాలలో దాక్కోవచ్చు. తెలివితక్కువ వాళ్ళు ఇంద్రియాలలో దొరికేస్తారు. తెలివైనవాళ్ళు ఇంద్రియాలలో దొరకరు, బుద్ధిలో దొరుకుతారు. బుద్ధిలో ఉన్న కామం తొందరగా కనబడదు. మనం వాళ్ళకి కామం లేదు అనుకుంటాము. అక్కడ కూడా కామం ఉంటుంది. ఏ వస్తువు అయితే స్వతంత్రముగా తనంతటతానుగా ఉందో అట్టి చైతన్యములో మాత్రము కామము లేదు, అక్కడ క్రోధములేదు, అక్కడ అజ్ఞానము లేదు. నువ్వు అక్కడికి మేలుకో. అప్పటివరకూ నువ్వు కామాన్ని జయించలేవు.

**మత్కర్మ కృన్మత్పరమో మద్భక్తస్సంగవర్జితః**

**నిర్వైర స్సర్వ భూతేషు యస్సమామేతి పాణ్డవ! (11-55)**

మత్కర్మ : నాకు ఇష్టమైన పని చేయి, నేను వద్దు అన్న పని చేయకు. నేను చెప్పింది వింటే శ్రేయస్సు కలుగుతుంది. నేను చెప్పింది వినకపోతే అంధకారంలో పడిపోతావు. మత్‌పరమః : నీ గమ్యంగా నన్నే పెట్టుకో. నువ్వు పొందవలసినవాడిని నేనే అంటున్నాడు పరమాత్మ. కాని మనం భగవంతుడిని గమ్యంగా పెట్టుకోము. మనం కోరికల్ని గమ్యంగా పెట్టుకొని, ఆ కోరిక నెరవేరటానికి భగవంతుడిని బల్లకట్టుకింద ఉపయోగించుకుంటున్నాము. ఎందుచేతనంటే మనకి కోరిక నెరవేరటం గమ్యంకాని, మనకి భగవంతుడు గమ్యంకాదు.

ఇక్కడ పరమాత్మ ఏమంటున్నాడు అంటే నీ కోరిక నెరవేరవచ్చు, నెరవేరకపోవచ్చు కాని గమ్యంగా నన్ను పెట్టుకో. నన్ను పొందటానికి సాధన చెయ్యి. నువ్వు నన్ను పొందలేకపోతే ఈ జన్మలో కనీసం ఆ పొందే ప్రయత్నంలో అయినా చనిపో. నీ ప్రయత్నం సిన్సియర్‌గా ఉండాలి, డెడికేషన్‌గా ఉండాలి. తరువాత కాలం కలసిరావాలి, నీకు నా అనుగ్రహం ఉండాలి. ఇన్ని రకాలుగా కలిస్తేనే నీకు మోక్షం సాధ్యం అవుతుంది.

మీరు నా పట్ల భక్తి కలిగి ఉండండి. అంటే దానికి వ్యభిచారభక్తి పనికిరాదు. కొంతమంది శనివారం ఒకరకంగా ఉంటారు, ఆదివారం ఒక రకంగా ఉంటారు. వాళ్ళమాట నిలకడగా ఉండదు, మనసు కుదురుగా ఉండదు. ఈ నిలకడలేని భక్తిని వ్యభిచారభక్తి అంటారు. బాగా స్థిరత్వం ఉన్న భక్తి అవ్యభిచారభక్తి. కొంతమంది భక్తికి అసలు చలనం ఉండదు. వాళ్ళకి ఏదయినా నష్టం వచ్చినా, కష్టం వచ్చినా, శరీరానికి బాధలు వచ్చినా పరమేశ్వరుడు పట్ల ఉన్న విశ్వాసం చలించదు. ఇటువంటి భక్తులు అంటే నాకు ఇష్టం అన్నాడు పరమాత్మ. మీరు ఇంటి దగ్గర మీ డ్యూటీ మీరు చెయ్యండి. కానీ హృదయంలో మటుకు భగవంతుడికి స్థానం ఇవ్వండి. మనం పొందవలసింది నారాయణుడు. మన ఇంట్లో వాళ్ళకి, మనకి వున్న సంబంధాలు స్వప్న సంబంధాలు. ఈ దేహం ఎంత నిజమో ఈ సంబంధాలు కూడా అంతే నిజం అనుకుని, మనకి నిజమైన బంధువు భగవంతుడే అని తెలుసుకుని మీ హృదయంలో ఉన్న భగవంతుడికి మీరు దూరం కావద్దు. ఇంట్లో వాళ్ళకి చేతులతోటి పనులు చేసినా మనస్సులో మటుకు భగవంతుడిని విడిచిపెట్టకండి. మానసికంగా మీరు భగవంతుడికి దూరం కావద్దు.

నిర్వైరః సర్వభూతేషు : ఎవరయినా నీకు అపకారం చేసినా, మిమ్మల్ని పొరపాటుగా మాట్లాడినా మీరు వాళ్ళమీద కోపాలు, ద్వేషాలు పెట్టుకోవద్దు. వాళ్ళతోటి స్నేహం చెయ్యటం ఇష్టంలేకపోతే మానేయండి. ఎందుచేతనంటే మీరు విరోధాలు పెట్టుకుంటే మీకు భగవంతుడు జ్ఞాపకం రాడు. మనం ఎవరిమీద అయితే విరోధం పెట్టుకున్నామో మన మనస్సు వాళ్ళని తలపెడుతుంది అందుచేత నన్ను పొందటం కోసం అయినా మీరు విరోధాలు వదులుకోండి నీ ప్రవర్తన అహంకారపూరితంగా కాకుండా, భక్తిపూరితంగా ఉంటే, దేహం కేంద్రం కాకుండా, మనస్సు కేంద్రం కాకుండా, దైవాన్ని కేంద్రంగా పెట్టుకొని నువ్వు జీవిస్తూ ఉంటే, నువ్వు అహంకారాన్ని పెంచుకోవటానికి కాకుండా, దైవానుగ్రహం సంపాదించటానికి పనిచేస్తూ ఉంటే ఇంక నేను ఎక్కడికి పోతాను అర్జునా. నేను నీకు దొరికేస్తాను. నేను

నీకు లభ్యమవుతాను అన్నాడు పరమాత్మ.

నువ్వు భగవంతుడు మాటలు శ్రద్ధగా శ్రవణం చేసి, ఎలా జీవిస్తే మనకి ఆయన మోక్షం ప్రసాదిస్తాడో ఆ రకంగా జీవించటం నేర్చుకుని, మీ ఇంటి దగ్గర వృద్ధులు వుంటే వారిమీద చిరాకుపడకుండా భగవంతుడు మనకి ఇచ్చిన డ్యూటీ అని, ఆ రూపంలో వున్నవాడు కూడా నారాయణుడే అని నారాయణ స్మరణ చేసుకుంటూ వారికి సేవ చెయ్యండి. ఆ రకంగా మీ జీవితాన్ని బాగుచేసుకోండి. మీలో ఏమయినా లోపాలు ఉంటే వున్నాయని బాధపడకండి అవి పోగొట్టుకోవటానికి ప్రయత్నం చేయండి. మీ పనులు మీరు చేసుకుంటూ భగవంతుడిని గమ్యంగా పెట్టుకొని మీరు జీవించటం నేర్చుకుంటే కొన్ని అలవాట్లు వాటంతటవే కాల ప్రవాహంలో పోతాయి. అందుచేత మీరు నామస్మరణ చేయండి. నామస్మరణ చేయుటం వలన మీరు పవిత్రులవుతారు. పరమపవిత్రుడికి మాత్రమే భగవంతుడు తెలియబడతాడు. పవిత్రత, ఏకాగ్రత రెండూ మీ రెండు కళ్ళతోటి సమానం అనుకొని ఆ రెండూ సాధించడానికి నువ్వు ప్రయత్నం చేస్తూ తరించు.

**(సద్గురు శ్రీ నాన్నగారి అనుగ్రహభాషణములు, 23-01-2011, జిన్నూరు)**

ప్రియమైన ఆత్మబంధువుల్లారా,

భగవద్గీతలో జ్ఞానయోగం, కర్మయోగం,భక్తియోగం,ధ్యానయోగం అన్ని యోగాలకు సమానమైన ప్రాముఖ్యత ఇచ్చాడు. భగవద్గీత అంటే అది మోక్షద్వారం అంటే మోక్షంలో ప్రవేశించటానికి తగిన సూచనలు అన్నీ భగవద్గీతలో భగవంతుడు జీవకోటికి బోధించాడు. అందులో అరిషడ్వర్గాల గురించి భగవంతుడు ఎక్కువగా చెప్పాడు. అరిషడ్వర్గాలు అంటే నీలోపల ఉన్న ఆరు శత్రువులు, అవి ఎవరు అంటే కామ, క్రోధ, లోభ, మోహ,మద,మాత్సర్యములు. ఇవి నీలోపల ఉన్న శత్రువులు, ఇవి బయట ఉండవు. బ్రహ్మజ్ఞానం పొందిన వారిలో తప్పించి అంటే రామకృష్ణుడు, రమణుడు, వశిష్ఠుడు ఇటువంటి మహాత్ములలో తప్పించి ప్రతీ మనిషిలోను ఈ శత్రువులు ఉంటాయి. వాడు ధనవంతుడా పేదవాడా, వాడికి అధికారం ఉందా, లేదా వారు స్త్రీలా పురుషులా అని ఇటువంటి సంబంధం ఏమీలేదు. సాధకులలో కూడా ఇవి ఉంటాయి. సిద్ధిపొందేవరకూ వీటి గొడవ తప్పదు. వాల్మీకి రామాయణంలో ఏమని చెప్పాడంటే ఈ సృష్టిలో ఉన్న ప్రతీ జీవరాశిని కాలం కుమ్మేసి విడిచిపెడుతుంది అని చెప్పాడు. ఎవరి పరిస్థితులు ఎలా ఉంటాయో మనం చెప్పలేము. ఒక ఏరియాకు రాజుగా ఉన్న ఆయన చివరిరోజులలో ఆయన దగ్గర పనిచేసిన గుమాస్తా అన్నం పెడితే తిని